పత్తిసంచులు తడిచిన ఘటనపై విచారణ

59 బస్తాలు తడిచాయని నివేదిక అందజేసిన అధికారులు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో నాలుగో తేదీన కురిసిన భారీ వర్షం కారణంగా పత్తి సంచులు తడిచిన ఘటనపై విచారణ జరిపించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బుధవారం ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు వ్యవసాయ మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మీ భాయి సూచనలతో రీజనల్ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాస్ విచారణ నిర్వహించారు. విచారణలో 7329 బస్తాల పత్తి మార్కెట్‌లో ఉండగా.. 59 బస్తాలు మాత్రమే తడిసినట్టు విచారణలో తేలింది. తడిసిన పత్తిని సిబ్బంది సహాయంతో ఆరబెట్టి అదే రోజున కొనుగోలు చేశారనీ, రైతులకు ఆర్థిక నష్టం జరగలేదని రీజనల్ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాస్ నివేదిక పంపారు.



లెంకలగడ్డలో సుడిగాలి బీభత్సం

నేలకొరిగిన చెట్లు, పంటలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రకృతి బీభత్సానికి జయశంకర్-భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ ఉమ్మడి మండలంలోని లెంకలగడ్డ గోదావరి అటవీ ప్రాంతంలో చెట్లు, మిర్చి, పత్తి పంటలకు భారీ నష్టం వాటిల్లింది. మంగళవారం సాయంత్రం లంకలగడ్డ సమీపంలోని గోదావరి వద్ద ఒక్కసారిగా సుడిగాలి బీభత్సం సృష్టించింది. సుమారు నాలుగు గంటలపాటు రావడంతో అటవీ ప్రాంతంలో చెట్లు నేలకొరిగాయి. వందల ఎకరాల్లో పత్తి, మిర్చి పంటలకు నష్టం వాటిల్లింది. చెట్లు కూకటివేళ్లతో పడిపోయాయి. కొన్ని విరిగిపోయాయి. ఈ సందర్భంగా పలిమెల రేంజ్ ఆఫీసర్ నాగరాజు మాట్లాడుతూ.. లెంకలగడ్డ సమీపంలో అటవీ ప్రాంతంలో 1213 ఎకరాల్లో సుమారు 200 చెట్లు పడిపోయాయని తెలిపారు. సర్వే చేసి ఎన్ని చెట్లు విరిగాయి..? ఎంత నష్టం జరిగిందనే వివరాలు చెబుతామని తెలిపారు. గత సంవత్సరం మేడారం అడవుల్లో కూడా కొన్ని వేల చెట్లు నేలకొరిగిన విషయం తెలిసిందే. ప్రస్తుతం లెంకలగడ్డ గోదావరి సమీపంలో భారీ సుడిగాలి బీభత్సం జరగడంతో రైతులు, ప్రజలు భయాందోళనకు గురయ్యారు.

చేనేత సమస్యలు పరిష్కరించాలి

- రుణమాఫీ చేయాలి
- మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

చేనేత సమస్యలు పరిష్కరించి వెంటనే రుణమాఫీ చేయాలని మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు ప్రభుత్వాన్ని డమాండ్ చేశారు. రుణమాఫీ, చేనేత సమస్యలు పరిష్కరించాలని చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో 20న రాష్ట్ర కమిషనర్ కార్యాలయం ముందు జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిస్తూ బుధవారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చెరుపల్లి సీతారాములు మాట్లాడుతూ.. చేనేతలకు రుణమాఫీ ప్రకటించి ఏడాది దాటినా అమలు కాలేదన్నారు. చేనేత సహకార సంఘాలకు 12 ఏండ్ల నుంచి ఎన్నికలు లేవని, వెంటనే ఎన్నికలు నిర్వహిస్తే కార్మికులకు ఉపాధి లభిస్తుందన్నారు. సంఘాల క్యాష్ క్రెడిట్ లోను రద్దు చేయాలని, నిల్వ ఉన్న వస్త్రాలను కొనుగోలు చేయాలని కోరారు. ఏండ్ల నుంచి సహకార సంఘాలను జిఒ 51 పేరుతో వేధిస్తున్నారని అన్నారు. చేనేత పథకాలు విషయంలో ఎలాంటి కోర్రీలు పెట్టకుండా అమలు చేయాలన్నారు. పోచంపల్లి చేనేత వస్త్రాలకు పేటెంటు ఉన్నా సూరత్‌లో డూప్లికేట్ తయారు చేసి పది వేల రూపాయల చీర ఐదు వందలకే అమ్ముతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఈ డూప్లికేట్‌ను అరికట్టాలన్నారు. చేనేతపై జీరో జిఎస్‌టి అంటే.. చేనేత పట్టు చీర రూ.2500 దాటితే 18 శాతం జిఎస్‌టి విధిస్తున్నదని, జిఎస్‌టి రద్దుకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. పవర్ లూమ్ రంగం పోటీకి తట్టుకునే విధంగా చేనేతకు సబ్సిడీలు ఇచ్చి ఆదుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం జిఎస్‌టి రద్దు చేయకపోతే రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందని సిఎం హామీ ఇచ్చారని, ఆ హామీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. రద్దు చేసిన సంక్షేమ పథకాల పునరుద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. సిరిసిల్లలో వర్క్ టూ ఓనర్ పథకం పూర్తి చేసి పవర్ లూమ్ కార్మికులకు అందించాలని అన్నారు. పవర్ లూమ్ కార్మికులకు, అనుబంధ కార్మికులకు యారన్ సబ్సిడీ అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు వనం శాంతి కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజి మురళీధర్, గీత కార్మిక సంఘం అధ్యక్షులు రమణ, మత్స్యకారుల సంఘం అధ్యక్షులు లేల్లెల బాలకృష్ణ, కార్యదర్శి ముషం నరహరి, రంగారెడ్డి జిల్లా చేనేత కార్మిక సంఘం అధ్యక్షులు చెరుకు స్వామి, రాజోలి చేనేత కార్మికులు అబ్దుల్ వాహిద్, షేక్ షావలి పాల్గొన్నారు.

తేమ శాతం పేరుతో కోతలా?

- విదేశీ పత్తి దిగుమతి వల్ల దేశ రైతులు నష్టపోతున్నారు
- విద్యాసంస్థల యాజమాన్యాలతో చర్చలు జరపండి
- నిరుద్యోగుల పోరాటానికి సిపిఎం మద్దతు
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ, పక్కన పోతినేని,వెంకటేశ్వర్లు తదితరులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పత్తి కొనుగోళ్లపై కేంద్ర ప్రభుత్వం విధించిన నిబంధనలు ఎత్తేసి.. మొత్తం పంటను మద్దతు ధరకు కొనుగోలు చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. తేమ శాతం పేరుతో కోతలు విధించొద్దని కోరారు. కొత్తగూడెంలోని మంచికంటి భవన్‌లో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తేమ శాతం పేరుతో పత్తి కొనుగోలు చేయకుండా ఆంక్షలు పెట్టడం సరికాదన్నారు. యాప్ ద్వారానే పత్తి కొనుగోళ్లకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని చెప్పడం వల్ల పత్తి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. ఎకరాకు ఏడు క్వింటాళ్ల పత్తి మాత్రమే కొనుగోలు చేస్తామని చెప్పడం సిగ్గు చేటన్నారు. అదనపు పత్తి పంటను ఏమి చేయాలో కేంద్ర ప్రభుత్వమే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల నుంచి పత్తి కొనుగోలు చేయకుండా విదేశాల నుంచి సుంకాలు ఎత్తివేసి దిగుమతి చేసుకుంటోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనివల్ల దేశ రైతాంగం తీవ్రంగా నష్టపోతుందని, కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని అన్నారు.

రాష్ట్రంలో ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయకపోవడం వల్ల నిరుద్యోగులు ఆందోళన చేస్తున్నారని, వారి పోరాటానికి సిపిఎం మద్దతు ఇస్తోందని జాన్‌వెస్లీ ప్రకటించారు. జాబ్ క్యాలెండర్ ప్రకటించి యువతకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రయివేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు సమ్మెలో ఉన్నాయని, దీనివల్ల విద్యార్థులు నష్టపోతున్నారని, ప్రభుత్వం వారితో చర్చలు జరిపి మొదట హామీ ఇచ్చిన రూ.12 వేల కోట్లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 42 శాతం బిసి రిజర్వేషన్ బిల్లుకు బిజెపి అడ్డుపడుతోందని, బిల్లుకు అసెంబ్లీ ఆమోదం తెలిపి కేంద్రానికి పంపితే లేనిపోని కారణాలు చెప్పి అడ్డుకుంటోందని తెలిపారు.

రాష్ట్రంలో డ్రగ్స్ మహమ్మారి పెరిగిపోయిందని, దీని వల్ల యువత జీవితాలను కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో డ్రగ్స్ వ్యాపారం పెరిగిందని, పది నెలల్లో 11 వందల కేసులు నమోదయ్యాయని, డ్రగ్స్‌ను అరికట్టడంలో ప్రభుత్వం నిద్ర మత్తు వీడాలన్నారు. రెండు రాష్ట్రాల మధ్య నీటి వాటాలు తేలే వరకూ బనకచర్లకు ఎలాంటి అనుమతులూ ఇవ్వొద్దని కేంద్రాన్ని కోరారు.

రైతులను కాపాడే పంటల బీమా కావాలి : పోతినేని

రైతులు చనిపోయాక కల్పించే బీమా కంటే.. ముందే రైతులను కాపాడే పంటల బీమా అమలు చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ ప్రభుత్వాన్ని కోరారు. కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్లిన పంటకు రక్షణ కల్పించడంలో సరైనా సౌకర్యాలు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. మార్కెట్‌కి వచ్చిన పంటకు రక్షణ లేకపోతే రైతులు చేనులో పంటను పెట్టుకోలేడు, ఇంట్లో పెట్టుకోలేడు.. ఇలాంటి పరిస్థితుల్లో ఆ పంటకు కొనుగోలు కేంద్రాల వద్ద రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిది కాదా? అని ప్రశ్నించారు. కేంద్ర బృందం రాష్ట్రంలో నష్టపోయిన పంటను సర్వే చేసి, రైతులకు ఎకరానికి రూ.50 వేల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

రహదారులకు మరమ్మతులు చేయాలి : వెంకటేశ్వర్లు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అకాల వర్షాలకు దెబ్బ తిన్న రహదారులను వెంటనే మరమ్మతులు చేయించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని కోరారు. రహదారుల మరమ్మతులు చేశాకే ఇసుక లారీలకు అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అకాల వర్షం వల్ల జిల్లాలోని అళ్లపల్లి, గుండాల పరిసరాల్లో మొక్కజొన్న, పత్తి, వరి రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో పంటల బోనస్ రూ.18 కోట్ల 65 లక్షల రూపాయలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని విడుదల చేయాలని కోరారు. ఈ విలేకర్ల సమావేశంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అన్నవరపు సత్యనారాయణ, లిక్కి బాలరాజు ఉన్నారు.

బిజెపిలో బిఆర్ఎస్ విలీనం తథ్యం

- జూబ్లీహిల్స్‌లో మైనార్టీలను మభ్యపెట్టేందుకు కుట్ర
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిజెపిలో బిఆర్ఎస్ విలీనం తథ్యమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు. జూబ్లీహిల్స్ క్రైస్తవ సంఘాల ప్రతినిధులు బుధవారం హైదరాబాద్‌లోని సిఎం నివాసంలో ఆయనను కలిసి తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. భారత్ జోడో యాత్ర ద్వారా దేశంలోని మైనార్టీలకు రాహుల్ గాంధీ భరోసా ఇచ్చారని గుర్తు చేశారు. అదే స్ఫూర్తిని తెలంగాణలోనూ కొనసాగిస్తున్నామని సిఎం అన్నారు. "బిఆర్ఎస్‌ను బిజెపికి తాకట్టుపెట్టారు. జూబ్లీహిల్స్‌లో మైనార్టీలను మభ్యపెట్టడానికి కుట్ర జరుగుతోంది. కాళేశ్వరం కేసును సిబిఐకి అప్పగించి మూడు నెలలైనా స్పందించలేదు. ఫార్ములా ఈ-కార్ రేస్ కేసులో కెటిఆర్ అరెస్టుకు గవర్నర్ ఇంకా అనుమతి ఇవ్వలేదు. బిజెపి, గులాబీ పార్టీల మధ్య ఒప్పందం లేకుంటే ఎందుకు అనుమతివ్వరు? ఆ పార్టీ బిజెపిలో విలీనమవుతుందనే విషయం గతంలోనే కవిత చెప్పారు. రెండు పార్టీలు కుమ్మక్కై జూబ్లీహిల్స్‌లో ఓటర్లను గందరగోళానికి గురి చేస్తున్నాయి" అని సిఎం విమర్శలు గుప్పించారు. ప్రజలు తిరస్కరించినా బిఆర్ఎస్ అబద్దపు ప్రచారాలు మానలేదని ఎద్దేవా చేశారు. బిజెపి,బిఆర్ఎస్ పార్టీలకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.



సామినేని మృతి పాతర్లపాడుకు తీరని లోటు : పి.మధు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అత్యంత నీతివంతమైన కమ్యూనిస్టు సామినేని రామారావు అని మాజీ ఎంపి, సిపిఎం ఎపి రాష్ట్ర మాజీ కార్యదర్శి పెనుమల్లి మధు అన్నారు. ఇటీవల హత్యకు గురైన ఖమ్మం జిల్లా చింతకాని మండలం పాతర్లపాడు గ్రామానికి చెందిన సిపిఎం తెలంగాణ రాష్ట్ర నాయకులు సామినేని రామారావు కుటుంబాన్ని బుధవారం మధు పరామర్శించారు. రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రామారావు భార్య స్వరాజ్యం, కుమారుడు విజయ కుమార్‌తో మాట్లాడారు. ధైర్యంగా ఉండాలని కుటుంబ సభ్యులకు సూచించారు. అనంతరం మధు మాట్లాడుతూ.. సామినేని రామారావుని రాజకీయంగా ఎదుర్కొలేక మాటువేసి దొంగ చాటుగా హత్య చేశారన్నారు. హంతకులు భవిష్యత్‌లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. పోలీసులు కేసు విచారణ పేరుతో దొంగాట ఆడుతున్నారని ఆరోపించారు. పోలీసులు తలుచుకుంటే రామారావు హంతకులను వెంటనే అరెస్టు చేయొచ్చని, కానీ కావాలనే అధికార పార్టీ నాయకులు చెప్పినట్టుగా విచారణ చేస్తున్నారని ఆరోపించారు. ఆయన మృతి పాతర్లపాడు గ్రామస్తులకు తీరని లోటన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యుడిగా, రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రామారావు ప్రజలకు సేవలు అందించారని గుర్తు చేశారు.

డిమాండ్లు పరిష్కరించేంత వరకూ బంద్

- 8న అధ్యాపకుల సాంత్వన సభ
- దేవసేన వేధింపులను భరించలేం
- ఉన్నత విద్యాసంస్థల సమాఖ్య చైర్మన్ రమేశ్ బాబు


ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

తమ డిమాండ్లను పరిష్కరించేంత వరకు ప్రయివేటు కాలేజీల నిరవధిక బంద్ కొనసాగుతుందని ఉన్నత విద్యా సంస్థల సమాఖ్య చైర్మన్ రమేశ్ బాబు స్పష్టం చేశారు. బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఈ నెల ఎనిమిదిన హైదరాబాద్‌లోని ఎల్‌బి స్టేడియంలో నిర్వహించనున్న అధ్యాపకుల సాంత్వన సభ పోస్టర్‌ను సమాఖ్య నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమేశ్‌బాబు మాట్లాడుతూ.. ఈ నెల 11 లేదా 12న హైదరాబాద్‌లో పది లక్షల మంది విద్యార్థులతో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. కళాశాల విద్యా కమిషనర్ దేవసేన వేధింపులను ఇక భరించలేమనీ, ఆమెను ఆ బాధ్యతల నుంచి తప్పించాలని కోరారు. ఇది వరకే ప్రభుత్వానికి ఆమెపై ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. ప్రభుత్వ పథకం ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని అమలు చేస్తున్న ప్రయివేటు కళాశాలల యాజమాన్యాలకు, ప్రభుత్వానికి మధ్య సరైన సంబంధాలు కొనసాగించేలా ఆమె వ్యవహారం లేదని అభ్యంతరం తెలిపారు. ఒకట్రెండు కళాశాలల్లో జరిగే ఉల్లంఘనలను అన్ని కళాశాలలకు ఆపాదిస్తూ కించపరిచేలా దేవసేన వ్యాఖ్యలు చేయడం తగదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం సజావుగా అమలు చేసేందుకు వీలుగా అధ్యయనం కోసం వేసిన కమిటీలో ఉన్న అవసరం లేని ఒకరిద్దరిని తొలగించాలని డిమాండ్ చేశారు. అదే సమయంలో కమిటీని వేసినందుకు, తాము చేసిన చూసిన ట్రస్ట్ బ్యాంక్‌పై అధ్యయనం చేసేందుకు పూనుకున్నందుకు ఆయన ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. కమిటీలోకి బ్యాంకింగ్ లేదా సంబంధిత విషయం పట్ల అవగాహన ఉన్న వారిని తీసుకోవాలని సూచించారు. కమిటీకి ఇచ్చిన మూడు నెలల గడువు కాలయాపనకే పనికొస్తుందనీ, దాని గడువును నెల రోజులకు కుదించాలని కోరారు. 50 శాతం బకాయిలను వెంటనే చెల్లించాలనీ, మిగిలిన 50 శాతం బకాయిలను మార్చిలోపు చెల్లించేలా రోడ్ మ్యాప్ ప్రకటించాలని డిమాండ్ చేశారు.

సమాఖ్య వైస్ చైర్మన్ బిజాపూర్ శ్రీనివాస్ మాట్లాడుతూ... ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం సక్రమ అమలు కోసం అధ్యయనానికి కమిటీ వేస్తూ జిఒ రావడం తమ విజయమని అభివర్ణించారు. కమిటీలోకి పదవీ విరమణ పొందిన నిష్ణాతులైన వారిని తీసుకోవాలని కోరారు. సెక్రటరీ జనరల్ కె.ఎస్.రవికుమార్ మాట్లాడుతూ... తామెదుర్కొంటున్న దుర్భర పరిస్థితిల్లో అనివార్యంగా ఉద్యమబాట పట్టినట్టు తెలిపారు. ఇంజినీరింగ్ విద్యతో హైదరాబాద్‌కు, రాష్ట్రానికి ఉన్న బ్రాండ్ ఇమేజ్‌ను కాపాడాలని కోరారు. కార్యదర్శి బొజ్జా సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ... విద్యాశాఖపై ముఖ్యమంత్రికి అధికారులు, సలహాదారులు సరైన సలహాలు ఇస్తున్నట్టు లేరని అనుమానం వ్యక్తం చేశారు. సీఎం ఒక రోజు పూర్తిగా విద్యపై అధ్యయనం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సమాఖ్య కార్యదర్శులు కె.రాందాస్, రేపాక ప్రదీప్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.వి.సునీల్ కుమార్, కోశాధికారి కొడాలి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ అభివృద్ధిపై తేల్చుకుందామా?

- చెత్త ఎవరో- సత్తా ఎవరిదో అర్థమవుతుంది
- దమ్ముంటే బహిరంగ చర్చకు రా?
- రేవంత్‌రెడ్డికి కెటిఆర్ సవాల్



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లో ఎవరు ఎంత అభివృద్ధి చేశారో దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలని సిఎం రేవంత్‌రెడ్డికి బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ సవాల్ విసిరారు. పదేండ్లలో బిఆర్ఎస్, రెండేండ్లలో కాంగ్రెస్ చేసిన అభివృద్ధి పనుల గురించి మాట్లాడుకుందామని చెప్పారు. అప్పుడు చెత్త ఎవరో, సత్తా ఎవరిదో తెలుస్తుందన్నారు. కమాండ్ కంట్రోల్ సెంటర్, గాంధీభవన్, జూబ్లీహిల్స్ ప్యాలెస్, అసెంబ్లీకైనా వచ్చి చర్చించడానికి తాను సిద్ధమని ప్రకటించారు. బుధవారం హైదరాబాద్‌లో బిఆర్ఎస్ కార్యాలయం తెలంగాణ భవన్‌లో జూబ్లీహిల్స్ ప్రగతి నివేదికను కెటిఆర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఓడిపోతామనే భయంలో రేవంత్‌రెడ్డి నోటికొచ్చినట్టు బూతులు మాట్లాడుతున్నారని అన్నారు. ఆయన తిట్టినా సిఎం కాబట్టి తాము గౌరవంగానే మాట్లాడుతామని చెప్పారు. హైదరాబాద్ అభివృద్ధి కోసం బిఆర్ఎస్ హయాంలో 42 ఫ్లై ఓవర్లు, అండర్ పాస్‌లు నిర్మించామని వివరించారు. కాంగ్రెస్ కొత్తగా ఈ రెండేళ్లలో ఒక్క రోడ్డు అయినా వేసిందా?, ఒక్క ఫ్లైఓవర్‌ను నిర్మించారా?అని ప్రశ్నించారు. కొత్త రోడ్ల సంగతి తర్వాత ఉన్నవి గుంతలమయం అయ్యాయనీ, వాటిని పూడ్చారా? అని నిలదీశారు. హైదరాబాద్ ప్రజలు మళ్లీ వాటర్ ట్యాంకర్లపై ఆధారపడే పరిస్థితికి కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిందన్నారు. హైదరాబాద్‌లో చెత్త సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టిందే బిఆర్ఎస్ అని గుర్తు చేశారు. కెసిఆర్ కూడా సిఎంగా ఒక ప్రాంతాన్ని పర్యవేక్షించారని అన్నారు. స్వచ్ఛ హైదరాబాద్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టి వేలాది స్వచ్ఛ ఆటోలను ప్రవేశపెట్టామని వివరించారు. ఇప్పుడు కనీసం ఒక్క ఆటోనైనా కొన్నారా?అని ప్రశ్నించారు. స్వచ్ఛ్ సర్వేక్షణ్‌లో 34 అవార్డులు పొందామన్నారు. బిఆర్ఎస్ హయాంలోనే ఎస్ఎన్‌డిపిని ప్రారంభించామని చెప్పారు. పదేండ్లలో కెసిఆర్ హైదరాబాద్‌ను క్లీన్‌సిటీగా మారిస్తే.. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం మురికి కూపంగా మార్చిందని ఆరోపించారు.

లక్ష డబుల్ బెడ్రూం ఇండ్లు ఇచ్చాం

పదేండ్లలో కెసిఆర్ ప్రభుత్వం హైదరాబాద్‌లో లక్ష డబుల్ బెడ్రూం ఇండ్లను నిర్మించిందని కెటిఆర్ అన్నారు. ఈ రెండేండ్లలో కాంగ్రెస్ ఒక్క ఇళ్లైనా కట్టిందా?అని ప్రశ్నించారు. ఒక్క ఇల్లు కట్టకపోగా వేలాది ఇండ్లను హైడ్రా పేరుతో ఈ ప్రభుత్వం కూలగొట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్ మెట్రో రైల్‌ను పూర్తి చేసిన ఘనత బిఆర్ఎస్‌కే దక్కుతుందన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి మాత్రం మెట్రో సిఎఫ్‌వో, ఎల్అండ్‌టి సిఎఫ్‌వోలను బెదిరిస్తున్నారని అన్నారు. అందుకే తట్టుకోలేక మెట్రోరైల్ నుంచి ఎల్అండ్‌టి తప్పుకుందని వివరించారు. పారిశ్రామికవేత్తలు పారిపోతున్నారని చెప్పారు. కాంగ్రెస్ హయాంలో పరిశ్రమలకు పవర్ హాలిడే ఉండేదని గుర్తు చేశారు. కెసిఆర్ వచ్చాక పరిశ్రమలు, గృహ వినియోగం, వ్యవసాయానికి 24 గంటల నాణ్యమైన కరెంటును సరఫరా చేశారని అన్నారు. ఎల్ఇడి బల్బులతో తెలంగాణను దేదీప్యమానంగా చేశామనీ, ఈ రెండేండ్లలో రేవంత్ ప్రభుత్వం ఒక్క ఎల్ఇడి అయినా పెట్టిందా?అని ప్రశ్నించారు. ఎవరి హయాంలో విద్యుత్ వెలుగులు కొనసాగాయో ఎవరి హయాంలో విద్యుత్ కోతలతో ఇబ్బంది పడ్డారో చర్చిద్దామా?అని రేవంత్‌రెడ్డికి కెటిఆర్ సవాల్ విసిరారు.

పెరుగుతున్న గన్ కల్చర్

రాష్ట్రంలో పర్యావరణం, పచ్చదనాన్ని పెంచడం కోసం 16 వేల నర్సరీలను ఏర్పాటు చేశామని కేటీఆర్ చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా ఒక్క నర్సరీ కూడా పెట్టకపోగా.. ఉన్న చెట్లను నరికేస్తున్నదని అన్నారు. రూ.10 వేల కోట్ల కోసం కక్కుర్తిపడి హెచ్‌సియులో జీవవైవిధ్యాన్ని దెబ్బతీశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐటీ ఉద్యోగాలను మూడు లక్షల నుంచి తొమ్మిది లక్షలకు పెంచామని గుర్తు చేశారు. బిఆర్ఎస్ హయాంలో సిసి కెమెరాలు పెట్టి కెసిఆర్ శాంతి భద్రతలను పెంచారని అన్నారు. రాష్ట్రంలో గన్ కల్చర్ పెరుగుతున్నదని చెప్పారు. మహారాష్ట్రలోని ముంబై పోలీసులు హైదరాబాద్‌లోని చర్లపల్లిలో రూ.12 వేల కోట్ల విలువైన డ్రగ్స్‌ను పట్టుకున్నారనీ, ఇది తెలంగాణ పోలీసులకు అవమానం కాదా?అని ప్రశ్నించారు. ఫార్ములా ఈ కార్ కేసులోనూ గవర్నర్ ప్రాసిక్యూషన్‌కు అనుమతి ఇచ్చారని అన్నారు. చార్జ్‌షీట్‌లో విషయం లేకపోవడం వల్ల దాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పక్కన పెట్టేసిందని చెప్పారు. తాను లై డిటెక్టర్ టెస్టుకు సిద్ధమనీ, రేవంత్‌రెడ్డి కూడా సిద్ధమేనా?అని ప్రశ్నించారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు 'ఆర్‌టిఎఫ్ఎంఎస్'

టిజిఎన్‌పిడిసిఎల్ సిఎండి వరుణ్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు రియల్ టైం ఫీడర్ మానిటరింగ్ సిస్టం(ఆర్‌టీఎఫ్ఎంఎస్)ను ఎన్‌పిడిసిఎల్ పరిధిలోని 16 సర్కిళ్లలో ఏర్పాటు చేశామని టిజిఎన్‌పిడిసిఎల్ సిఎండి కర్నాటి వరుణ్ రెడ్డి తెలిపారు. హనుమకొండ జిల్లా టిజిఎన్‌పిడిసిఎల్ విద్యుత్ భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలోనే ఆధునాతన టెక్నాలజీని వినియోగిస్తున్నామని, ఈ సిస్టమ్ ద్వారా విద్యుత్ అంతరాయాలను రియల్ టైంలో గుర్తించి, తక్షణ చర్యలు తీసుకోవచ్చని వివరించారు. ఫీడర్ల పర్యవేక్షణతో విద్యుత్ అంతరాయాల సమయం గణనీయంగా తగ్గుతుందని తెలిపారు. మొదట ఐదు సబ్‌స్టేషన్లలో ప్రయోగాత్మకంగా పరీక్షించి విజయవంతం అయిన తర్వాత 133 సబ్‌స్టేషన్లకు విస్తరించామని చెప్పారు. అదనంగా ఫాల్ట్ ప్యాసేజ్ ఇండికేటర్లు (ఎఫ్‌పిఐఎస్)ను 33 కెవి, 11కెవి లైన్లలో ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. తద్వారా లోపాలు సంభవించిన భాగాన్ని వెంటనే గుర్తించి విద్యుత్ పునరుద్ధరణ వేగవంతమవుతుందని చెప్పారు. ఆటోమేటిక్ మీటర్ రీడింగ్ (ఏఎంఆర్) ద్వారా హెచ్‌టీ వినియోగదారులకు బిల్లులలో పారదర్శకత, ఖచ్చితత్వం పెరుగుతుందని తెలిపారు. సిబ్బంది సమయం ఆదా అవుతుందని, బిల్లింగ్‌లో తప్పులు తగ్గుతాయని పేర్కొన్నారు. ఆర్‌టిఎఫ్ఎంఎస్, ఎఫ్‌పిఐఎస్, ఎఎంఆర్ ఆధునిక సాంకేతికతలతో ఎన్‌పిడిసిఎల్ వినియోగదారులకు వేగవంతమైన, నాణ్యమైన విద్యుత్ సేవలు అందించడమే లక్ష్యమని వివరించారు.

తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనాలి

సిఎంకు మహేశ్వర్‌రెడ్డి లేఖ

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం కొనాలని బీజేపీఎల్పీ నేత ఏలేటి మహేశ్వరరెడ్డి కోరారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ప్రకటించిన విధంగా ఆయా పంటలకు మద్దతు ధర ఎందుకు ఇవ్వకుండా దాటవేస్తున్నారో సీఎం సమాధానం చెప్పాలన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన సీఎం రేవంత్‌రెడ్డికి రాసిన లేఖను విడుదల చేశారు. రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చేందుకు అలవికాని హామీలు ఇచ్చారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక వాటిని విస్మరించిందని విమర్శించారు. మొంథా తుఫానుతో రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వారిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని చెప్పారు.

టీ-హబ్ స్థాపనతో స్టార్టప్ రాజధానిగా హైదరాబాద్

- కెటిఆర్ ట్వీట్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో
టీ-హబ్ స్థాపనతో స్టార్టప్ రాజధానిగా హైదరాబాద్ ఎదిగిందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కెటిఆర్ తెలిపారు. హైదరాబాద్‌ను దేశానికే స్టార్టప్ రాజధాని టీ-హబ్ మార్చిందని పేర్కొన్నారు. టీ-హబ్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఆయన బుధవారం ట్వీట్ చేశారు. టీ-హబ్ వల్ల భారతదేశంలోని స్టార్టప్ ఎకోసిస్టమ్‌లో అగ్రగామిగా తెలంగాణ ఎదగడానికి పునాది వేసిందని గుర్తు చేశారు. కేసీఆర్ దూరదృష్టి గల నాయకత్వంలో, తాము ఒక సమగ్రమైన ఆవిష్కరణల వ్యవస్థను నిర్మించామనీ, ఇది హైదరాబాద్‌ను భారతదేశపు స్టార్టప్ రాజధానిగా మార్చిందని వివరించారు. టీ-హబ్ తర్వాత వీ-హబ్, టీ-వర్క్స్, తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్), ఎమర్జింగ్ టెక్నాలజీస్ వింగ్, రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ సర్కిల్ ఆఫ్ హైదరాబాద్ (రిచ్) వంటి సంస్థలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఒక చిన్న ఇంక్యుబేటర్‌గా ప్రారంభమై, ప్రస్తుత స్థాయికి టీ-హబ్ ఎదగడం ఒక గొప్ప ప్రయాణమని పేర్కొన్నారు. 18 కరాటే పోటీల్లో పాల్గొన్న హైదరాబాద్ పాత బస్తీ కిషన్‌బాగ్‌కు చెందిన 12 ఏండ్ల సబ మహీన్‌ను అభినందించారు. మహారాష్ట్ర, రాజస్థాన్‌లో నిర్వహించిన కరాటే పోటీలో పాల్గొని ఆమె బంగారు పతకాలను సాధించారు. భవిష్యత్తులో ఒలింపిక్స్‌లో ఆడాలని ఆయన ఆకాంక్షించారు.

మూసీకి ముప్పు..!



- మరమ్మతులు, నిర్వహణ పట్ల నిర్లక్ష్యం
- టెండర్లు పిలిచినా.. ఎవరూ ముందుకు రాని వైనం
- రూ.4 కోట్లతో ప్రతిపాదనలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పెద్ద ప్రాజెక్టుల్లో ఒక్కటైన మూసీ ప్రమాదపుటంచుల్లో కెళ్తోంది.. ఏటా పూడిక పేరుకుపోవడంతోపాటు క్రష్ గేట్లు, డ్యాం గోడల నుంచి లీకేజీలతో నీరు వృథాగా పోతోంది. బడ్జెట్ కేటాయింపుల్లేక నిర్వహణ కష్టంగా మారింది. పది స్కావర్ గేట్లను శాశ్వతంగా మూసేయడంతో పూడిక తొలగింపునకు అవకాశం లేకుండా పోయింది. ఫలితంగా క్రమంగా నీటి నిల్వ సామర్థ్యం తగ్గి.. ఆయకట్టు కూడా తగ్గుతోంది.

1954లో సోలిపేట గ్రామం వద్ద మూసీనదిపై ప్రాజెక్టు నిర్మాణం చేపట్టి 1963లో పూర్తి చేశారు. నాటి నుంచి 1987 వరకు ఎడమవైపు 41 కిలోమీటర్లు, కుడివైపు 38 కిలో మీటర్ల పొడవునా మొత్తం 42 గ్రామాల రైతులకు 43 వేల ఎకరాలకు సాగునీరు అందేది. స్కావర్ గేట్లను కాంక్రీట్‌తో శాశ్వతంగా మూసేసిన తర్వాత ఆయకట్టు 33 వేల ఎకరాలకు పడిపోయింది.

మూసీ ప్రాజెక్టు నిర్వహణకు ప్రతి ఏటా సుమారు రూ.25 లక్షలు ఖర్చవుతోంది. గేట్ లీకేజీలు, జనపనార, గ్రీజు ఆయిల్ తదితరాలకు సుమారు రూ.13 లక్షల వరకు ఖర్చు అవుతోంది. ప్రాజెక్టు డ్యాంపై కరెంటు నిర్వహణ కోసం రూ.12 లక్షల వరకు వ్యయమవుతోంది. గతంలో ప్రతి రాష్ట్ర బడ్జెట్‌లోనూ మూసీ నిర్వహణ కోసం నిధులు కేటాయించేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. అధికారులు ప్రతిపాదనలు పంపిస్తేనే నిధులు విడుదల చేస్తున్నారు. దీంతో ప్రాజెక్టు నిర్వహణ కష్టంగా మారింది.

టెండర్లు పిలిచినా.. ఫలితం శూన్యం..

మూసీ ప్రాజెక్టుకు 30 స్కావర్, క్రష్, రెగ్యులేటర్ గేట్లు ఉన్నాయి. వీటిలో పది స్కావర్ గేట్లను శాశ్వతంగా మూసేశారు. ఎనిమిది క్రష్ గేట్లలో మూడు గేట్ల నుంచి నీరు లీకేజీ రూపంలో వాగులోకి వెళ్తోంది. రెండు దశాబ్దాలుగా గేట్ల నుంచి నీరు లీకేజీ అవుతున్నా మరమ్మతులకు నోచుకోలేదు. మూసీ ప్రాజెక్టు డ్యాం గేట్ల తర్వాతి ప్రాంతంలో డ్యాం గోడల నుంచి కూడా నీరు లీకేజీ అవుతోంది. లీకేజీల వెంబడి చెట్లు పెరిగి ఆ గోడను మరింత బలహీన పరుస్తున్నాయి. మూసీ ప్రాజెక్ట్ డ్యామ్ మరమ్మతులు, గేట్ల లీకేజీలు, డ్యాం రక్షణ గోడలలో గౌటింగ్, మరమ్మతులు తదితరాలకు రూ.75 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది. కానీ, టెండర్ల కోసం కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాలేదు. త్వరలో మళ్లీ టెండర్ పిలిచే అవకాశముంది.

రూ.4 కోట్ల ప్రతిపాదనలకు మోక్షమెప్పుడో..?

గతంలో అతిథులు, పర్యాటకులతో కళకళలాడిన మూసీ ప్రాజెక్ట్ అతిథి గృహం నేడు వెలవెలబోతోంది. ఆ గృహానికి మరమ్మతులు, గేట్లకు రంగులు, ఇతర మరమ్మతుల కోసం అధికారులు సుమారు ఐదు నెలల కిందట రూ. నాలుగు కోట్లతో ప్రతిపాదనలు పంపించారు. ఇంతవరకు ఆ ప్రతిపాదనలకు మోక్షం లభించలేదు.

స్కావర్ గేట్ల మూసివేతతో పెరిగిన పూడిక

మూసీ ప్రాజెక్టులోని పూడికను ఎప్పటికప్పుడూ తొలగించేందుకు ప్రాజెక్టు నిర్మాణ సమయంలో స్పిల్‌వే అడుగు భాగంలో పది స్కావర్ గేట్లు ఏర్పాటు చేశారు. వరద భారీగా వచ్చినప్పుడు వీటిని తెరవడం ద్వారా పూడికను దిగువకు పంపించే వీలుండేది. వీటిని సరిగ్గా నిర్వహించకపోవడం వల్ల గతంలో రెండు గేట్లు కొట్టుకుపోయాయి.

రూ. నాలుగు కోట్లతో ప్రతిపాదనలు పంపించాం..
మూసీ ప్రాజెక్టు ఎఇ మధు

మూసీ ప్రాజెక్టు మరమ్మతుల కోసం ఇటీవల రూ.75లక్షలతో శాంక్షన్ ఆర్డర్స్ మంజూరయ్యాయి. ఎస్టిమేషన్ వేశాం. టెండర్లు పిలిచినా ఎవరూ ముందుకు రాలేదు. రెండోసారి టెండర్లు పిలుస్తాం. ప్రాజెక్టు అతిథిగృహం గేట్లకు రంగులు, తదితర మరమ్మతుల కోసం రూ.నాలుగు కోట్లతో ప్రతిపాదనలు పంపించాం. త్వరలో రూ.రెండు కోట్లు మంజూరయ్యే అవకాశముంది.

ముస్లిములకు బిఆర్ఎస్ చేసిందేంటి?

- షబ్బీర్ అలీ

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో
బిఆర్ఎస్ పదేండ్ల పాలనలో ముస్లిములకు చేసిందేంటని మాజీ మంత్రి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ప్రశ్నించారు. బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. న్యాయం కోసం హైకోర్టు, సుప్రీం కోర్టులకు వెళ్లిన ముస్లిములకు బిఆర్ఎస్ ప్రభుత్వం తరపున న్యాయవాదిని కేటాయించలేదని గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీ ముస్లిముల కోసం రాష్ట్రంలో పలు విద్యాసంస్థలను నెలకొల్పిందనీ, మతబేధం లేకుండా అందరినీ సమానంగా చూసిందనీ, రేషన్ కార్డులు అందజేసిందనీ, ఉర్దూ టీచర్ పోస్టులను భర్తీ చేసిందని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలోని మెడికల్ కాలేజీల్లో 1,248 మంది ముస్లిము విద్యార్థులు చదువుతుంటే, వారిలో 682 మందికి ఫ్రీ సీట్లు వచ్చాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం సర్వే చేసి రాష్ట్రంలో ముస్లింలు 12.58 శాతం ఉన్నట్టు తేల్చిందన్నారు. రాష్ట్ర మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి మొహమ్మద్ అజారుద్దీన్ మాట్లాడుతూ తనకు మంత్రిగా అవకాశమిచ్చిన కాంగ్రెస్ పార్టీకి కృతజ్ఞతలు తెలిపారు. రెండేండ్లుగా ముస్లిము విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్స్ విడుదలకు కృషి చేస్తానని తెలిపారు. చాలా సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని పరిష్కరిస్తానని చెప్పారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ముస్లిములు కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ వెంట ఉన్నారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆరు నెలల మంత్రి అని వస్తున్న విమర్శలను ఆయన కొట్టిపారేశారు. ఈ సమావేశంలో వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లా హుసేన్ తదితరులు పాల్గొన్నారు.



పత్తి ఎకరాకు రూ.30 వేల నష్టపరిహారం

- సామాజిక కార్యకర్త హెచ్.నరసింహ నిరసన, దీక్ష

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో
వర్షాలకు నష్టపోయిన పత్తి పంటకు ఎకరాకు రూ.30 వేల పరిహారం చెల్లించాలని సామాజిక కార్యకర్త హెచ్.నరసింహ ప్రభుత్వాన్ని కోరారు. నారాయణపేట జిల్లా ఉట్కూర్ మండలంలోని బిజ్వార్‌లో స్వామి వివేకానంద విగ్రహం ముందు బుధవారం ఉదయం పది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధిక వర్షాల వల్ల పత్తి, వరి మొక్కజొన్న రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఎకరాకు పత్తి కేవలం నాలుగు నుంచి ఐదు క్వింటాళ్ల (సాగు అయిందని) దిగుబడి మాత్రమే వస్తోందన్నారు. స్వయంగా కేంద్ర ఆర్థిక, గణాంకాల శాఖ డైరెక్టరేట్ నివేదిక ప్రకారం.. పత్తి దిగుబడి తగ్గిందని చెప్పిందని గుర్తు చేశారు. అందువల్ల పత్తి పంటకు ఎకరాకు రూ.30 వేల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదే విధంగా 20 శాతం వరకు తేమ ఉన్న పత్తిని కూడా మద్దతు ధరకు సిసిఐ ద్వారా కొనే విధంగా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. ఎకరాకు కొత్తగా ఏడు క్వింటాళ్ల పత్తి మాత్రమే కొంటాం అనే నిబంధన ఎత్తివేసి 12 క్వింటాళ్ల పత్తి కొనాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన దీక్ష కార్యక్రమానికి రైతులు రాఘవేంద్ర, నాగిరెడ్డి, హన్మంతు, చిన్న నర్సింహా, ఆంజనేయులు, గుడిసె రాజు, అశోక్, రాజప్ప, తులసీదాస్, తిరుపతి, వెంకటప్ప, వడెప్ప, బడేసాబ్, నరేష్, ఆశప్ప, రాజమూరి తదితరులు మద్దతు తెలిపారు.

మహిళా సాధికారతే దేశాభివృద్ధికి సూచి

- వివిజిఎఫ్ గ్లోబల్ సదస్సులో మంత్రి సీతక్క

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో
మహిళా సాధికారతే దేశాభివృద్ధికి సూచిక అని పంచాయతీరాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. నెదర్లాండ్‌కు చెందిన అంతర్జాతీయ స్థాయి మహిళా నాయకత్వ వేదిక "వైటల్ వాయిసెస్ గ్లోబల్ ఫెలోషిప్" సదస్సులో "ప్రతికూలతల నుండి సాధికారతవైపు.. దేశాలను మారుస్తున్న మహిళల శక్తి" అనే అంశంపై ఆమె ప్రసంగించారు. "ఆఫ్రికాలో కోడింగ్ నేర్చుకుంటున్న అమ్మాయి, లాటిన్ అమెరికాలో వ్యాపారం ప్రారంభించిన తల్లి, భారతదేశంలోని గిరిజన స్త్రీ... మన అందరిది ఒకే గమ్యం. మహిళ అభివృద్ధి చెందితేనే సమాజం మొత్తం అభివృద్ధి చెందుతుంది. నా ప్రయాణం అడవుల నుండి గ్లోబల్ వేదికల వరకూ సాగింది. సాధికారత ఎవరో ఇస్తే రాదు. మనమే సాధించాలి. ప్రపంచానికి మహిళల శక్తి చూపించాల్సిన సమయం వచ్చింది" అని సీతక్క అన్నారు. అభివృద్ధి చెందిన దేశాల్లో మహిళల భాగస్వామ్యం 40 శాతం కాగా, అభివృద్ధి చెందుతున్న దేశాల్లో అది 20 శాతం లోపే ఉందని తెలిపారు. స్థూల జాతీయ ఉత్పత్తిలో మహిళలకు భాగస్వామ్యం పెంచేలా తమ ప్రభుత్వం కృషి చేస్తుందని వెల్లడించారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా మార్చే సంకల్పంతో పని చేస్తున్నామని వివరించారు. అందులో భాగంగా ప్రతి సంవత్సరం కనీసం రూ.25 వేల కోట్ల బ్యాంక్ లింకేజ్ రుణాలు మహిళా సంఘాలకు అందిస్తున్నామని చెప్పారు. "ఇందిరా మహిళా శక్తి పాలసీ ద్వారా మహిళా సంఘాలను ఆర్థికంగా స్వయం సమృద్ధిగా తీర్చిదిద్దుతున్నాం. మహిళలు క్యాంటీన్లు నడుపుతున్నారు, సోలార్ ప్లాంట్లు నిర్వహిస్తున్నారు. పెట్రోల్ బంకులు నడుపుతున్నారు. ఆర్‌టిసి బస్సులో ఉచితంగా ప్రయాణిస్తున్న మహిళలే నేడు ఆ సంస్థకే బస్సులను అద్దెకు ఇస్తూ యాజమానులుగా ఎదిగారు" అని ఇందిరా మహిళా శక్తి ద్వారా మహిళలు సాధించిన విజయాలను గ్లోబల్ వేదికపై వెల్లడించారు. తన చిన్ననాటి ఆదివాసీ బాలిక జీవితం నుండి రాష్ట్ర మంత్రిగా ఎదిగిన ప్రేరణాత్మక ప్రయాణాన్ని, ఆ మార్గంలో సమాజానికి అందించిన సేవలను, ప్రజాస్వామ్య పోరాటాలను, కరోనా కాలంలో చేసిన సహాయ కార్యక్రమాలను సీతక్క వివరించారు. పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా మహిళా సాధికారత, గ్రామీణాభివృద్ధి, పేదల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను ప్రపంచ వేదికపై ఆవిష్కరించారు.



ఎకరానికి రూ.40 వేల నష్టపరిహారం చెల్లించాలి

- రైతుల నిరసన

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో
మొంథా తుఫాన్‌తో పంటలు నష్టపోయిన రైతులందరికీ ఎకరానికి రూ.40 వేల పరిహారం చెల్లించాలని రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలంలోని కూచనపల్లి గ్రామంలో బుధవారం రోడ్డుపై రైతులు నిరసన వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ అధికార ప్రతినిధి మల్లికార్జున్‌రెడ్డి రైతులకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. తుపాన్ ప్రభావంతో భారీ వర్షం కురవడంతో చేతికందే దశలో ఉన్న పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు పంట నష్టం సర్వే చేయాలని కోరారు. ప్రభుత్వం కేవలం ఎకరానికి రూ.10 వేల నష్టపరిహారం ఇస్తామనడం సరైనది కాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం పరిహారం పెంచాలని డిమాండ్ చేశారు.



బాధితులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

రోడ్డు ప్రమాద బాధితులకు అండగా ఉంటాం

- మృతుల కుటుంబాలను ఆదుకుంటాం : మనోహర్‌రెడ్డి

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో
రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం మీర్జాపూర్ సమీపంలో జరిగిన ఆర్‌టిసి బస్సు రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వారు, గాయపడిన వారి కుటుంబాలకు అండగా ఉంటామని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి చెప్పారు. ప్రమాదంలో నియోజకవర్గానికి చెందిన 13 మంది మృతిచెందడం బాధాకరమని అన్నారు. తాండూరు-వికారాబాద్ రోడ్డు మూడు నెలల్లో పూర్తి చేస్తామని చెప్పారు. తాండూరు పట్టణం ఇందిరమ్మ కాలనీకి చెందిన మహమ్మద్ ఖలీద్, సలీహ, జాహీరా ఫాతిమా కుటుంబాలను బుధవారం ఆయన పరామర్శించారు. ప్రభుత్వం తరపున రూ.ఏడు లక్షల చొప్పున ముగ్గురికి అందజేశారు. అదేవిధంగా తాండూరు మండలం గౌతాపూర్‌కు చెందిన ముస్కాన్ బేగం, తాండూరు పట్టణం వాల్మీకినగర్‌కు చెందిన కిష్టాపురం వెంకటమ్మ, బృందావన్ కాలనీకి చెందిన తబాస్సుం జహాన్, ఓల్డ్ తాండూరుకు చెందిన దస్తగిరి బాబా (బస్సు డ్రైవర్) కుటుంబాలను కూడా పరామర్శించారు. రూ.ఏడు లక్షల చొప్పున చెక్కులను అందజేశారు. యాలాల్ మండలం పేర్కంపల్లి గ్రామానికి చెందిన సాయిప్రియ, నందిని, తనుష ఇండ్లకు వెళ్లి పరిహారం చెక్కులు ఇచ్చారు. యాలాల్ మండలం హాజీపూర్ గ్రామానికి చెందిన కురుగంట బందప్ప, కురుగంట లక్ష్మీ దంపతులు మృతిచెందడంతో వారి ఇంటికి వెళ్లి పరామర్శించి ఇద్దరికి కలిపి రూ.14 లక్షల చెక్కులను అందించారు.

ఎవరి అనుమతితో మిమ్మల్ని అరెస్టు చేశారు?

- సిఎం రేవంత్‌రెడ్డికి ఎంపి రఘునందన్‌రావు ప్రశ్న

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో
మాజీ సిఎం కెసిఆర్ కుటుంబం అవినీతిపై ఆధారాలు ఉన్నాక గవర్నర్ అనుమతి ఎందుకని బిజెపి ఎంపి రఘునందన్‌రావు సిఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. ఎమ్మెల్యేను అరెస్టు చేయడానికి గవర్నర్ అనుమతి కావాలని ఎక్కడుంది? ఈ దేశం, రాష్ట్రంలో ఇప్పటి వరకు ఏ ఎమ్మెల్యే అరెస్టు కాలేదా? అని గుర్తు చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో పార్టీ నేతలతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. 'బిఆర్ఎస్ పాలనలో మిమ్మల్ని రెండు సార్లు అరెస్టు చేశారు. నాడు కెసిఆర్ ఎవరి అనుమతి తీసుకుని అరెస్టు చేశారు' అని ప్రశ్నించారు. కెటిఆర్ అరెస్టు విషయంలో రేవంత్‌రెడ్డి తీరు ఆడలేక మద్దెల ఓడు అన్న చందంగా ఉందని ఎద్దేవా చేశారు. కెసిఆర్ కుటుంబ సభ్యులను అరెస్టు చేయవద్దంటూ ఎఐసిసి పెద్దలు చేసిన సూచన మేరకే వారిని అరెస్టు చేయకుండా అబద్ధాలతో కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. ఎన్‌డిఎస్ఎ, పిసి ఘోష్ కమిషన్ నివేదికను హడావుడిగా అసెంబ్లీలో పెట్టి ఈ కేసును సిబిఐకి పంపితే దీనిపై కెసిఆర్, హరీశ్ రావు, మాజీ సిఎస్ ఎస్.కే జోష్, స్మితా సబర్వాల్ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారని తెలిపారు. దాంతో వీరందరిపై సిబిఐ విచారణ ఆపాలని హైకోర్టు స్టే ఇచ్చిందని గుర్తు చేశారు. మరో రెండు వారాల్లో ఏజీతో కౌంటర్ వేయాలని చెబితే ఇప్పటి వరకు కౌంటర్ వేయించలేదని విమర్శించారు. ఎసిబి కేసులో అరెస్టు చేయించడం సిఎంకు చేతకావడం లేదన్నారు. 50సార్లు ఢిల్లీకి వెళ్లిన రేవంత్‌రెడ్డి కెసిఆర్ కుటుంబం అవినీతిపై ప్రధానికో, కేంద్ర హోంమంత్రికో ఎందుకు ఫిర్యాదు చేయలేదని ప్రశ్నించారు. అజారుద్దీన్‌కు మంత్రి పదవి బిసి కోటాలో ఇచ్చారా? లేక మైనార్టీ కోటాలో ఇచ్చారా? సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదాలతోనే మరణాలెక్కువ

- యూనిసెఫ్ శిక్షణలో మంత్రి పొన్నం



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో
రోడ్డు ప్రమాదాల కారణంగా అధిక మంది చనిపోతున్నారని రాష్ట్ర రవాణా శాఖ, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. రవాణా శాఖ కార్యక్రమాలను క్షేత్రస్థాయికి తీసికెళ్లాలని చెప్పారు. గ్రామీణ స్థాయిలో కూడా శిక్షణా కార్యక్రమాలు నిర్వహించేలా చూడాలని అభిప్రాయపడ్డారు. బుధవారం హైదరాబాద్‌లో యూనిసెఫ్ ఆధ్వర్యంలో ఆర్‌టిఎ సభ్యులు, రీజనల్ ట్రాన్స్‌ఫోర్టు అథారిటీ అనధికారిక సభ్యులకు హోటల్ మెర్క్యూరీలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇటీవల కర్నూలు, చేవెళ్ల బస్సు ప్రమాదాలు జరిగిన తీరుపై మంత్రి పొన్నం ప్రభాకర్ వారికి వివరించారు. రోడ్డు ప్రమాదాలను నివారించడానికి స్కూళ్లు, కాలేజీలు , విద్యా సంస్థల్లో రోడ్డు నిబంధనలపై వ్యాసరచన పోటీలు నిర్వహించాలని సూచించారు. విజేతలకు బహుమతులు ప్రధానం చేయాలని చెప్పారు. కరపత్రాలు పంపిణీ చేసి ప్రచారం చేయాలనీ, గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించాలని సూచించారు. ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటూనే, మరణాలు సంభవించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు గాయపడిన వారికి క్యాష్‌లెస్ చికిత్స అమలు చేస్తున్నదని వివరించారు. ఎనిమిది రోజుల్లో 1.50 లక్షల విలువైన వైద్యచికిత్స అందిస్తారని చెప్పారు. దీనిపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. యూనిసెఫ్ ప్రతినిధి డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ... గ్లోబల్ బర్డెన్ ఆఫ్ డిసిసి రిపోర్ట్ ప్రకారం గత 10 నుంచి 19 సంవత్సరాల్లో రోడ్డు రోడ్డు ప్రమాదాలను నివారించడానికి యూనిసెఫ్ మూడు దేశాల్లో అవగాహన కల్పించడానికి ఎంపిక చేయగా మన దేశం నుంచి అహ్మదాబాద్ , ముంబై , హైదరాబాద్ నగరాలను ఎంపిక చేసినట్టు తెలిపారు. దేశంలో సగటున 1317 రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. దేశంలో 477 మరణాలు ప్రతి రోజూ సగటున రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నారనీ గుర్తుచేశారు. భారత ప్రజారోగ్య హెల్త్ డీన్ డాక్టర్ శైలజ మాట్లాడుతూ రోడ్డు నిబంధనలపై స్కూళ్లు , కాలేజీల్లో అవగాహన కల్పించాలని సూచించారు. రోడ్డు భద్రత నిబంధనలు తెలియాలంటే విద్యార్థి దశ నుంచి ప్రవర్తన ముఖ్యమైందన్నారు. అందులో భాగంగా ఆక్టివ్, బ్లీడింగ్, కంట్రోల్ ప్రోగ్రాం అమలు చేయాలని సూచించారు. శిక్షణ కార్యక్రమంలో యూనిసెఫ్ ప్రతినిధి డాక్టర్ శ్రీధర్ , రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి హాజరైన ప్రాంతీయ రవాణా శాఖ అనధికార సభ్యులు పాల్గొన్నారు.

సింటెక్స్ గిన్నిస్ రికార్డ్

హైదరాబాద్ : తమ 50వ వార్షికోత్సవం సందర్భంగా దేశ వ్యాప్తంగా బాధ్యతాయుతమైన రీతిలో నీటి వినియోగాన్ని చేస్తామంటూ ప్రతిజ్ఞ చేసేందుకు 24 గంటల్లో 31,000 మందికి పైగా ప్రజలను సమీకరించడం ద్వారా గిన్నిస్ వరల్డ్ రికార్డ్‌ను నమోదు చేసినట్లు నీటి పరిష్కారాల సంస్థ సింటెక్స్ తెలిపింది. దేశవ్యాప్తంగా ఉన్న కమ్యూనిటీలు, భాగస్వాములు, ఉద్యోగులు డిజిటల్ ప్లాట్‌ఫామ్‌పై కలిసి ప్రతిజ్ఞ చేశారని వెల్స్పన్ బిపిఎల్ ఎండి, సింటెక్స్ డైరెక్టర్ యశోవర్ధన్ అగర్వాల్ పేర్కొన్నారు.

మినార్ ప్రచారకర్తగా చెఫ్ సంజయ్ తుమ్మా

హైదరాబాద్ : తమ మినార్ బ్రాండ్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా ప్రముఖ చెఫ్ సంజయ్ తుమ్మాను నియమించుకున్నట్లు ప్రీమియం పిండి వంటల తయారీదారు శ్రీ సాయి రోలర్ ఫ్లోర్ మిల్ డైరెక్టర్ ఆదిత్య బన్సాల్ తెలిపారు. వంట పట్ల సంజయ్‌కు ఉన్న మక్కువ ప్రతి వంటగదిని, ప్రతి స్క్రీన్‌ను వెలిగించే అతని నైపుణ్యంలో సముచితంగా ప్రతిబింబిస్తుందన్నారు. సాంప్రదాయ వంటకాల వైవిధ్యాన్ని కాపాడుకోవడంలో చెఫ్ సంజయ్ లోతైన అంకితభావం కలిగి ఉన్నారన్నారు.

'పత్తి' పరిమితిపై ఎంపి ఇంటి ముట్టడి

- పోలీసులు, బిఆర్ఎస్ నాయకుల మధ్య తోపులాట
- అమెరికా నుంచి దిగుమతుల కోసమే నిబంధనలు : జోగు రామన్న
- నిబంధనలు ఎత్తేయాలని డిమాండ్



బిఆర్ఎస్ నాయకులకు అడ్డుకుంటున్న పోలీసులు

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో
పత్తి కొనుగోళ్లలో ఏడు క్వింటాళ్ల పరిమితిని ఎత్తేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం బిఆర్ఎస్ ఆధ్వర్యంలో ఎంపి గొడెం నగేష్ ఇంటిని ముట్టడించారు. మాజీ మంత్రి జోగు రామన్న నాయకత్వంలో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు ఎంపి ఇంటి ముట్టడికి యత్నించారు. పోలీసులు ముందస్తుగా ఎంపి ఇంటి నలుమూలల బారికేడ్లు ఏర్పాటు చేశారు. బిఆర్ఎస్ శ్రేణులు వాటిని తోసుకుంటూ వెళ్లి ఎంపి ఇంటి ముందు బైఠాయించి నిరసన తెలిపారు. పోలీసులు వారిని అదుపు చేయడానికి యత్నించే క్రమంలో తోపులాట జరిగి ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. డిఎస్‌పి జీవన్‌రెడ్డి, సిఐలు మాజీ మంత్రి జోగు రామన్నతోపాటు నాయకులను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ క్రమంలో బిఆర్ఎస్ శ్రేణులు వాహనాన్ని అడ్డుకునే ప్రయత్నం చేశారు. వారిని అడ్డు తొలగించి జోగు రామన్నను రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై వదిలిపెట్టారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ.. తేమతో సంబంధం లేకుండా పత్తి, సోయా కొనుగోళ్లు చేపట్టాలని అనేక వినతులు ఇచ్చామన్నారు. గత నెల 24న పత్తి మార్కెట్ ప్రారంభమైందని, అదే రోజు 600పైగా పంట వాహనాలు వచ్చాయని తెలిపారు. అందులో ఐదు బండ్లకు మాత్రమే తేమ 12 శాతం వచ్చిందన్నారు. గతంలో బిఆర్ఎస్ హయాంలో సిసిఐ అధికారులు ఇదే నిబంధన పెడితే వారిపై ఒత్తిడి పెంచి 18 నుంచి 20 శాతం తేమ వచ్చినా పంట కొనుగోలు చేయించామని తెలిపారు. సిసిఐ పూర్తిగా కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉంటుందని, బిజెపి నుంచి గెలిచిన ఎంపి, ఎమ్మెల్యేలు రైతులకు మద్దతుగా ఉండాల్సిందిపోయి సిసిఐ నిబంధనలను సమర్థించడం సరికాదన్నారు. పత్తి కొనుగోళ్లలో ఏడు క్వింటాళ్ల పరిమితిని విధించడంతో రైతులు నష్టపోతారన్నారు. ఈ నిబంధనలు కేవలం అమెరికా పత్తిని ఇక్కడికి దిగుమతి చేసుకోవడం కోసమే పెట్టారని ఆరోపించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రైతుల నడ్డివిరిచేలా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నామ్ కే వస్తేగా కొన్ని సోయా కాంటాలు ప్రారంభించారని, కొనుగోళు మాత్రం చేయడం లేదని అన్నారు. రైతులు పండించిన పంటలను ఎలాంటి తేమ లేకుండా ప్రభుత్వాలే చివరి గింజ వరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు రమేష్, నారాయణ, అజయ్, రమేష్, పవన్ నాయక్, ప్రకాష్, ప్రశాంత్, తిరుపతి, సెవ్వ జగదీష్, కుమ్ర రాజు, ధమ్మపాల్, దాసరి రమేష్ పాల్గొన్నారు.

బేసిక్ పోలీసింగ్‌ను మరవొద్దు

- పోలీసు వ్యవస్థ ప్రతిష్టతకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు
- హైదరాబాద్ సిపి విసి సజ్జనార్



ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో
విధి నిర్వహణలో బేసిక్ పోలీసింగ్‌ను మరవొద్దని, కోర్ పోలీసింగ్‌ను సమర్థవంతంగా నిర్వర్తిస్తే నేరాలకు అడ్డుకట్ట వేయొచ్చని హైదరాబాద్ సిపి విసి సజ్జనార్ అన్నారు. పోలీసు వ్యవస్థ ప్రతిష్టతకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని, విధి నిర్వహణలో నిర్లక్ష్యాన్ని ఏమాత్రమూ ఉపేక్షించబోమని హెచ్చరించారు. బంజారాహిల్స్‌లోని ఐసిసిసి ఆడిటోరియంలో సీనియర్ పోలీస్ అధికారులు, ఎస్‌హెచ్‌ఒలతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. శాంతిభద్రతలు-నిర్వహణ, నేరాల నియంత్రణ, దర్యాప్తు, కమ్యూనిటీ ఎంగేజ్‌మెంట్-టెక్నాలజీ అడాప్షన్, మానవ వనరుల నిర్వహణ, తదితర అంశాల ప్రాధాన్యతను పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అధికారులకు వివరిస్తూ దిశానిర్దేశం చేశారు. శాంతి భద్రతల పరిరక్షణతోపాటు ప్రజల భద్రతే ముఖ్యంగా మెరుగైన పోలీసింగ్ చేయాలని సూచించారు. ప్రతి పోలీస్ అధికారి వంద శాతం తమ బాధ్యతను నిబద్ధత, క్రమశిక్షణతో నిర్వహించాలని చెప్పారు. సిబ్బందిని ఒకే పనికి పరిమితం చేయొద్దని, అన్ని విభాగాల్లోనూ ప్రావీణ్యం సాధించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రతి ఒక్కరూ వృత్తిని, ఉద్యోగాన్ని ప్రేమిస్తూ అంకితభావంతో విధులు నిర్వర్తించాలని వివరించారు. తమ పరిధిలో జరిగే విషయాలకు ఎస్‌హెచ్‌ఒలే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. గతంలో కొన్ని కేసుల్లో నిర్లక్ష్యం వహించినట్టు తమ దృష్టికి వచ్చిందని, ఆయా కేసులను మళ్లీ దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. పోలీసింగ్ జాబ్ అనేది అనేక సవాళ్లతో కూడుకుని ఉంటుందని, వాటన్నింటినీ అధిగమిస్తూ సమర్థవంతంగా విధులు నిర్వర్తిస్తూ ముందుకు వెళ్లాలన్నారు. అన్ని కేసులను రోటిన్‌గా తీసుకోవద్దని, చిన్న నేరాన్ని కూడా సమగ్రంగా దర్యాప్తు చేయాలని సూచించారు. ప్రతి కేసునూ సాంకేతికంగా అన్ని కోణాల్లోనూ విశ్లేషణ చేయాలని అన్నారు. దర్యాప్తును వేగవంతం చేసేందుకు అత్యాధునిక సాంకేతికత ఎఐ వినియోగించే అంశాన్ని పరిశీలిస్తున్నామని చెప్పారు. దేశంలోనే తెలంగాణ, హైదరాబాద్ పోలీసులకు ఒక బ్రాండ్ ఇమేజ్ ఉందని, దానిని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అదనపు సిపి (క్రైమ్స్) ఎం.శ్రీనివాస్, జాయింట్ సిపి(లా అండ్ ఆర్డర్) తఫ్సీర్ ఇక్బాల్, జాయింట్ సిపి (అడ్మిన్) జె.పరిమళ హానా నూతన్, డిసిపి(డీడీ) ఎన్.శ్వేత, డిసిపి(స్పెషల్ బ్రాంచ్) కె.అపూర్వారావుతో పాటు అన్ని జోన్ల డిసిపిలు పాల్గొన్నారు.